చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ అంబర్‌కిషోర్ ఝా, (ఇన్‌సెట్) భవనంపై ఉన్న ఖాళీ మద్యం సీసా

కేసులను త్వరగా పరిష్కరించాలి

- సీపీ అంబర్ కిషోర్ ఝా
- సెంట్రీ పోస్ట్ పక్కన మద్యం సీసా ఉండడంపై ఆగ్రహం

చెన్నారావుపేట, జూలై 20 : కేసులను త్వరితగతిన పరిష్కరించాలని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. చెన్నారావుపేట పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిసరాలతో పాటు స్టేషన్ భవనంపై ఉన్న సెంట్రీ పోస్ట్‌ను పరిశీలించారు. అయితే ఉన్న ఖాళీ మద్యం సీసాలను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. స్టేషన్ పరిసరాలను శుభ్రం గా ఉంచాలని, ఖాళీగా ఉన్న స్థలంలో మొక్కలు నాటాలని సూచించారు. అనంతరం పోలీస్ సిబ్బంది వివరాలు తెలుసుకొని పెండింగ్ కేసులను త్వరగా దర్యాప్తు చేయాలని అధికారులకు చెప్పారు. తర్వాత ఇటీవల 16చింతలతండాలో ప్రేమోన్మాది చేతిలో తల్లితండ్రులను కోల్పోయి గాయపడిన దీపిక, మదన్‌లను సీపీ పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్షపడేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. తనిఖీల్లో నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, జూలై 20 : భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ నిరుద్యోగ యువతకు హౌస్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, బైక్ మెకానిక్ (30 రోజులు), సీసీటీవీపై 13 రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ బాస రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థుల వయో పరిమితి 18 నుంచి 45 సంవత్సరాలు ఉండాలని, తెలుగులో రాయడం, చదవడం రావాలని, (చదువు కొనసాగిస్తున్న విద్యార్థులు, మున్సి పాలిటీ ప్రాంత అభ్యర్థులు మినహా) తెలుపు రేషన్‌కార్డు ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 4 పాస్‌పోర్ట్‌సైజు ఫొటోలు, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలు తీసుకొని హసన్‌పర్తిలోనని ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఐటీఐ, సంస్కృతి విహార్, టీటీడీసీలో వచ్చే నెల 1వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం కల్పిస్తామని, వివరాలకు 9704056522, 9849307873, 6281260878,9949108934 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

పోక్సో చట్టం కింద కేసు నమోదు

నయీంనగర్, జూలై 20 : మైనర్‌పై లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై కేసు నమోదైంది. కేయూసీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్ పరిధిలోని పెగడపల్లి గ్రామానికి చెందిన ఎలిదొండ సుమన్ ఇంటికి అదే గ్రామానికి చెందిన బాలిక వచ్చి వాళ్ల అమ్మకు ఫోన్ చేయాలని అడిగింది. ఈ క్రమంలో సుమన్ ఇంటి తలుపు మూసి బాలికపై లైంగిక దాడి చేసేందుకు ప్రయత్నించగా, సుమన్ చెయ్యి కొరికి ఇంటి బయటికి పరిగెత్తింది. జరిగిన విషయం తన తల్లికి చెప్పింది. తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత

పట్టుబడిన గంజాయిని అరెస్టు చేసి చూపుతున్న ఎస్పీ రామ్‌నాథ్ కేకన్

- నలుగురు అరెస్ట్.. 60 కిలోల ఎండు గంజాయి స్వాధీనం..
- ఒడిశా నుంచి జహీరాబాద్‌కు అక్రమ రవాణా
- వెల్లడించిన మహబూబాబాద్ ఎస్పీ రాంనాథ్ కేకన్
- పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేత

తొర్రూరు, జూలై 20 : ఒడిశా నుంచి రాష్ట్రానికి అక్రమంగా ఎండు గంజాయిని తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురు సభ్యులను పోలీసులు అరెస్టు చేసిన ఘటన డివిజన్ కేంద్రంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం తొర్రూరు పోలీస్ స్టేషన్లో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వెల్లడించారు. స్థానిక సీఐ సంజీవ ఆదేశాల మేరకు ఎస్సై జగదీష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం పట్టణంలోని గోపాలగిరి క్రాస్ రోడ్ లో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఓ బొలెరో వాహనం అనుమానాస్పదంగా, అతివేగంగా వస్తుండడంతో దానిని ఆపి తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న నలుగురు పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని వాహనాన్ని పరిశీలించగా 33 ప్యాకెట్లలో 60 కిలోల ఎండు గంజాయి లభ్యమైంది. దాని విలువ రూ.12లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఒడిశా నుంచి రాష్ట్రంలోని జహీరాబాద్‌కు ఎండు గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ సందర్భంగా ఒడిశాకు చెందిన ప్రహ్లాద్ సిసా, అప్పన్న బైరాగి, మిథుల సిసా, బసోతి పంగిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఎండు గంజాయితో పాటు రవాణాకు వినియోగించిన బొలెరో వాహనాన్ని, నాలుగు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పలువురు కానిస్టేబుళ్లకు ఎస్పీ కేకన్ రివార్డులు అందజేశారు. జిల్లాలో గంజాయి వినియోగం, రవాణాపై ఉక్కు పాదం మోపుతామని, ఈ అక్రమ దందాలో భాగస్వాములయ్యే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ సంజీవ, ఎస్సైలు గంద్రాతి సతీశ్, పిల్లల రాజు క్రాంతి కిరణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన జర్నలిస్టుకు ఉచిత వైద్యం

- నీలిమ హాస్పిటల్‌లో చికిత్స
- ఫోన్‌లో రమేశ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నీలిమ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు రమేశ్

జనగామ, నమస్తే తెలంగాణ/తరిగొప్పుల, జూలై 20 : ప్రమాదవశాత్తు తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని నీలిమ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు కుంభం రమేశ్‌ను శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. రెండు రోజుల క్రితం బైక్ ఢీకొట్టిన ఘటనలో రమేశ్ కాలు నరాలు తెగిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో బాధితుడిని బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ ఫుట్‌కేసర్‌లోని ఎమ్మెల్యే పల్లాకు చెందిన నీలిమ ఆస్పత్రిలో చేర్పించగా, వైద్యులు ఆపరేషన్ చేసి చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధితుడు రమేశ్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. రమేశ్ కాలుకు శస్త్ర చికిత్స చేసి నరాలు అతికించామని ఎలాంటి భయం లేదని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రమేశ్ ఆరోగ్యం మెరుగుపడుతున్నదన్నారు.

హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్‌లో మళ్లీ గుంతలు పడడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు,(ఇన్‌సెట్) ఇన్‌స్టాలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పోస్టు చేసిన నాడు- నేడు ఫొటో

అతుకుల రోడ్డుపై మళ్లీ గుంతలు

- పూడ్చివేసిన వారంలోపే బస్‌స్టేషన్ రోడ్డు గుంతలమయం
- మరమ్మతులు చేశామంటూ ట్విట్టర్‌లో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఫొటో ట్వీట్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

హనుమకొండ చౌరస్తా, జూలై 20 : హనుమకొండ బస్‌స్టేషన్ రోడ్డుకు మరమ్మతులు చేసి అతుకులు వేసిన వారంలోపే మళ్లీ గుంతలు పడ్డాయి. దీంతో పలువురు ప్రయాణికులు ప్రజాప్రతినిధులు, అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేశామంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో నాడు-నేడు ఫొటోలు పోస్టు చేసిన మూడు రోజుల్లోనే గుంతలు పడడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులు బస్‌స్టేషన్ రోడ్డును మూసివేసి చేసిన మరమ్మతుల నాణ్యత ఇదేనా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ వందలాది బస్సులు వెళ్లే రహదారి మళ్లీ గుంతలుపడి అధ్వానంగా మారడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. స్వయంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పరిశీలించి మరమ్మతులు చేయించిన మూడురోజులకే గుంతలు పడడంపై వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్, అధికారులు నాసిరకంగా పనులు చేసి ప్రజల సొమ్మును నీళ్ల పాలు చేశారని, వెంటనే నాణ్యతతో కూడిన పనులు చేసి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

రుణమాఫీపై అయోమయంగా ఉంది..

రుణమాఫీపై నాకు అయోమయంగా ఉంది. నేను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దవంగరలో గతంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ పొందిన. తర్వాత మళ్లీ రూ. లక్ష రుణం తీసుకున్నా. అయినా ఇప్పటికీ రుణమాఫీ కాలే. ఈ ప్రభుత్వంలో రుణమాఫీ అయిందని చెబుతున్నారు. ఎవరిని అడగాలో తెలియడం లేదు. అధికారులు పట్టించుకొని రుణమాఫీపై పట్టించుకొని రైతుల అనుమానాలు తొలగించాలి. -దేశబోయిన రాజు, రైతు, కొరిపెల్లి, పెద్దవంగర, మహబూబాబాద్

రైతుబంధు ఎగ్గొట్టడం కోసమే..

కేసీఆర్ ప్రభుత్వం ఉన్న పదేండ్లు రైతులకు పంటల సాగు కోసం ఎటువంటి ఢోకా లేకుండె. వానకాలం, యాసంగి పంటల సమయంలో తంచన్‌గా రైతుబంధు పైకం పడేది. కానీ ఇప్పుడు రేవంత్‌రెడ్డి రైతుబంధు డబ్బులనే పంట రుణాల మాఫీకి వాడుతూ మాయ చేస్తున్నడు. పంట రుణాలు రూ.లక్షలోపు ఉన్న వాళ్లందరికీ మాఫీ చేస్తున్నాం అంటూ ప్రకటనలు చేస్తున్నారు. కానీ ఆచరణలో కన్పించడం లేదు. రైతుబంధు డబ్బులు వేస్తే భూములున్న రైతులందరికీ మేలు జరిగేది.
– మామిండ్ల అశోక్, రాయపర్తి

కాంగ్రెస్ సర్కారును నమ్ముకుంటే ఇంతేనా?

రుణమాఫీ కాని రైతుల ఆందోళన

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన రుణమాఫీ కొందరికి మాత్రమే కావడంతో అన్నదాతల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారందరికీ మాఫీ చేస్తానని ప్రకటించి ఇప్పడేమో ప సమాచారం లేకుండా తప్పించుకుంటున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు అర్హత ఉన్నా జాబితా పేరులో లేకపోవడంపై అయోమయానికి గురైన అన్నదాతలకు ఎవరూ సరైన సమాచారం చెప్పకపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కాంగ్రెస్ సర్కారుపై ఎంతోమంది ఆశపెట్టుకుని ఇప్పుడు మోసపోయారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. -నమస్తే నెట్‌వర్క్, జూలై 20

జాబితాలో పేరు లేదు

ప్రభుత్వం మొదటగా రూ. లక్షలోపు అప్పున్న రైతులకు రుణమాఫీ చేసినట్లు చెబుతున్నది. నేను పాలకుర్తి ఏపీజీవీబీలో రూ. 50 వేల అప్పు తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీలో నాకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. ప్రభుత్వం ఇచ్చిన జాబితాలో నా పేరు లేదు. కేసీఆర్ సారు హయాంలో రుణమాఫీ అయింది. ఇప్పుడు ఎందుకు రాలేదో.. ఎవరిని అడగాలో.. తెలియడం లేదు. బ్యాంకుకు వెళ్తే జాబితాలో పేరు లేదని తెలిసింది. ఏపీ జీవీబీలో తీసుకున్న రుణానికి వడ్డీ సైతం చెల్లించాను. ఇప్పటికైనా ప్రభుత్వం నాకు రుణమాఫీ చేయాలి.
– మామిండ్ల సోమన్న, రైతు, పాలకుర్తి, జనగామ జిల్లా

మాఫీ వస్తాదనే నమ్మకం లేదు

గీసుగొండ రైతు సహకార సంఘంలో గత ఎడాది రూ. 30 వేల వ్యవసాయ రుణం తీసుకున్న. మాఫీ వస్తుందని ఆశించిన కానీ లిస్టులో నాపేరు రాలేదు. నాకు ఎందుకు మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ అధికారులను, సొసైటీ అధికారులను అడిగితే మాకేమీ తెల్వదని, పైనుంచి వచ్చిన లిస్టులో ఉన్న వారికే మాఫీ వర్తిస్తుందని చెప్తున్నారు. గవర్నమెంట్ నుంచి ఎలాంటి సమాచారం లేదంటున్నారు. రూ. లక్షలోపు అందరికీ మాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. వందకు 60 మందికి మాఫీ కాలేదు. రైతులు మాకు వస్తదా? రాదా అనే ఆందోళనలో ఉన్నారు. మాఫీ కాని రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. -డీ కుమారస్వామి, రైతు, రాంపురం, గీసుగొండ

వాణిజ్య

అబ్దుల్ కలామ్ టెక్నికల్ వర్సిటీ ప్రతినిధులతో టీ హబ్‌వర్గాలు

టీ హబ్‌తో అబ్దుల్ కలామ్ వర్సిటీ జట్టు!

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ): టీ హబ్‌తో కలిసి పనిచేసేందుకుగాను ఉత్తరప్రదేశ్‌కు చెందిన డాక్టర్ అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం ముందుకొచ్చింది. రెండు రోజులపాటు టీ హబ్ కార్యకలాపాలను పరిశీలించిన ప్రతినిధుల బృందం శనివారం..అక్కడ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు అవసరమైన అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు టీ హబ్‌తో కలిసి పనిచేయనున్నట్లు అబ్దుల్ కలామ్ టెక్నికల్ యూనివర్సిటీ ప్రతినిధులు ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు అవసరాలకు అనుగుణంగా రూపొందించడంలో టీ హబ్ దూసుకుపోతున్నదని, తమ యూనివర్సిటీలో ఆవిష్కరణలను ప్రోత్సహించేలా త్వరలో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ప్రైవేట్ రంగంలోని కార్పొరేట్ సంస్థలతోపాటు ప్రభుత్వరంగ సంస్థలు కూడా తమతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నాయని టీ హబ్ ప్రతినిధి వెల్లడించారు. స్టార్టప్‌లకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు టీ హబ్ ద్వారా లభిస్తున్నాయని..అలాగే దేశ, విదేశాలకు చెందిన పలు సంస్థలు సందర్శించడంతో పాటు కలిసి పనిచేసేందుకు వ్యూహాత్మక ఒప్పందాలను కుదుర్చుకుంటున్నాయని తెలిపారు.

పీఎస్‌యూలకు ముప్పతప్పినట్టేనా?

ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గనున్న ఎన్డీఏ సర్కారు

రాష్ట్రంలోని ఆరు ప్రభుత్వ సంస్థలకు కొత్త ఆశలు

రాష్ట్రంలో ప్రైవేటీకరణకు ప్రతిపాదిత సీపీఎస్‌యులు, వాటి ఆధీనంలోని భూములు(ఎకరాల్లో)..

1. హిందుస్థాన్ కేబుల్స్ లిమిటెడ్(హెసీఎల్)	–	324.87
2. హిందుస్థాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్	–	126.32
3. ఇండియన్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్(ఐడీపీఎల్)	–	551.03
4. హెచ్‌ఎంటీ వాచెస్	–	888.05
5. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీసీఐ)	–	2,272.85
6. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ	–	3,020
	మొత్తం -	7,183.12 ఎకరాలు

హైదరాబాద్, జూలై 20 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వరంగ సంస్థలను పూర్తిగా వదిలించుకోవాలని చూస్తున్న నరేంద్ర మోదీ సర్కార్ ఈసారికి కాస్త వెనుకడుగు వేసే అవకాశాలున్నాయి. పూర్తిస్థాయిలో మెజార్టీ రాకపోవడం, మరోవైపు ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పీఎస్‌యూల ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తున్నది. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రైవేటీకరణపై అత్యంత దూకుడుగా వ్యవహరించింది. ఫలితంగా దేశవ్యాప్తంగా 35 పీఎస్‌యూలు ప్రైవేటుపరం అయ్యాయి. మారిన రాజకీయ పరిణామాలతో పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలడంతో సంకీర్ణ సర్కారు తమ ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తున్నది. ఎన్‌డీఏ భాగస్వామ్యపక్షాలు ప్రైవేటీకరణకు ఒప్పుకునే అవకాశాలు లేకపోవడంతో మోదీ సర్కారు మరో కీలక నిర్ణయం తీసుకోబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో ప్రైవేటీకరణకు మొగ్గుచూపకుండా..కేవలం వాటాని పునరుద్ధరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి ఇటీవల పలువురు కేంద్ర మంత్రుల వ్యాఖ్యలు కూడా ఇందుకు బలంచేకూరుతున్నది. దీంట్లోభాగంగా రాష్ట్రంలో ఉన్న ఆరు ప్రభుత్వరంగ సంస్థలకు ఉపశమనం లభించే అవకాశాలున్నాయి.

మూతపడిన 10 సంస్థలు..

రాష్ట్రవ్యాప్తంగా పది ప్రభుత్వరంగ సంస్థలు మూతపడ్డాయి. ఒకానొక దశలో 27 సంస్థలు ఇక్కడ కార్యకలాపాలను కొనసాగించగా, ఆర్థిక ఇబ్బందులు, నిధులు కేటాయింపులు లేకపోవడంతో పది సంస్థలు మూతపడ్డాయి. దీంతో వీటి సంఖ్య 17కి పరిమితమయ్యాయి. ఈ మూతపడిన పది సంస్థల్లో ఆరింటిని పూర్తిగా వదిలించుకోవాలని కేంద్ర సర్కార్ గతంలోనే ఎత్తుగడ వేసింది. కానీ కేసీఆర్ సర్కార్ తీవ్రంగా వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గింది. అయితే నిబంధనల ప్రకారం రాష్ట్రంలో ఉన్న కంపెనీల భూములను విక్రయించాలంటే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలుపాల్సి వుంటుంది. ఈ క్రమంలోనే ఆరు సీపీఎస్‌యూల ప్రైవేటీకరణకు ఆమోదం తెలుపాలని రాష్ట్ర సర్కార్‌పై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకొచ్చింది.

హెచ్‌ఎంటీ తెరుచుకునేనా..

ఒకప్పుడు దేశానికి సమయం చూపించిన హెచ్‌ఎంటీ ప్రస్తుత ఆర్థిక సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నది. పీఎస్‌యూలను పట్టించుకోకుండా ప్రైవేట్ రంగ సంస్థలనే ప్రోత్సహిస్తున్న కేంద్ర సర్కార్ అనాలోచిత నిర్ణయాలతో ఎన్నో సంస్థలు మూతపడ్డాయి. వీటిలో దేశానికి సమయం చూపించిన హెచ్‌ఎంటీ కూడా ఉన్నది. ఒకప్పుడు హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగించిన ఈ సంస్థ తయారు చేసిన గడియారాలే ఎక్కువగా అమ్ముడయ్యాయి. ఆ తర్వాతి క్రమంలో ప్రైవేట్ రంగ సంస్థలనుంచి పోటీ పెరగడం, నిధులు కేటాయింపులు తగ్గిపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. ఇటీవల కాలంలో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమార స్వామి రాష్ట్ర పర్యటన సందర్భంగా హెచ్‌ఎంటీ ప్లాంట్‌ను కూడా సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద మంత్రితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హెచ్‌ఎంటీని పునరుద్ధరించి తమ ఉద్యోగాలు కాపాడాలని, తమకు రావాల్సిన ప్రయోజనాలను అందించాలని కోరారు. దీనిపై కుమార స్వామి సానుకూలంగా స్పందించారు. హెచ్‌ఎంటీ పునరుద్ధరించడంతోపాటు ఆక్రమణకు గురవుతున్న హెచ్‌ఎంటీ భూములను కాపాడుతామని ఆయన హామీ ఇచ్చారు.

ఎల్‌ఐసీ దూకుడు

74 శాతం రిటర్నును పంచిన సంస్థ

న్యూఢిల్లీ, జూలై 20: దేశీయ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ మళ్లీ తన పూర్వవైభావాన్ని సంతరించుకుంటున్నది. స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టిన మొదట్లో భారీగా పతనమైన కంపెనీ షేరు తిరిగి నేలకు కొట్టిన బంతిలా దూసుకుపోతున్నది. గడిచిన ఏడాదికాలంలో అత్యధికంగా రిటర్నులు పంచిన షేరు ఎల్ఐసీదే కావడం విశేషం. దేశీయ టాప్-10 దిగ్గజ సంస్థల్లో ఎల్‌ఐసీ షేరు 74 శాతం రిటర్నులు పంచింది. దేశీయ టెలికం దిగ్గజాల్లో ఒకటైన భారతీ ఎయిర్‌టెల్ 68 శాతం రిటర్నులు పంచగా..బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) 47.64 శాతం రిటర్నులు పంచింది. స్టాక్ ఎక్స్చేంజ్‌ల వద్ద ఉన్న సమాచారం మేరకు ఈ విషయం వెల్లడైంది. దేశీయ అత్యంత విలువైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కేవలం 10 శాతం మాత్రమే మార్కెట్ విలువ పెరగగా.. ఐసీఐసీఐ బ్యాంక్ 28 శాతం, టీసీఎస్ 25 శాతం, ఇన్ఫోసిస్ 22 శాతం చొప్పున బలపడ్డాయి.

గతేడాదికాలంలో సంస్థల షేర్ల పెరుగుదల రూపాయల్లో..

కంపెనీ	19 జూలై 19 2023 నాటికి	నాటికి జూలై 2024	తేడా (శాతంలో)
ఎల్‌ఐసీ	620.4	1,080.1	74.10
భారతీ ఎయిర్‌టెల్	869.8	1463	68.20
ఎస్బీఐ	601.35	887.85	47.64
ఐసీఐసీఐ బ్యాంక్	973.65	1248.15	28.19
టీసీఎస్	3,471	4,330.25	24.76
ఇన్ఫోసిస్	1,474.35	1,807.7	22.61
రిలయన్స్	2,840	3,138.35	10.51
హెచ్‌యూఎల్	2,671.75	2,725	1.99
ఐటీసీ	478.85	475.05	-0.79
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1,684.85	1,613.9	-4.21

'బిల్డర్లకు రాయితీలివ్వండి'

వచ్చే బడ్జెట్‌పై క్రెడాయ్

న్యూఢిల్లీ, జూలై 20: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోతున్న సార్వత్రిక బడ్జెట్‌లో గృహ కొనుగోలుదారులకు, తక్కువ ధరతో ఇండ్లను నిర్మించే బిల్డర్లకు మరిన్ని పన్ను ప్రయోజనాలు కల్పించాలని రియల్టీ బాడీ క్రెడాయ్ కోరుతున్నది. రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ గాడినపడాలంటే కేంద్ర ప్రభుత్వం మరిన్ని ప్రోత్సాహక నిర్ణయాలు తీసుకోవాలని, ముఖ్యంగా పన్ను రాయితీలు కల్పించినప్పుడే ఈ రంగ సంస్థలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగే అవకాశాలున్నాయని పేర్కొంది. కొత్తగా గృహాలు కొనుగోలుచేసేవారికి వడ్డీ రాయితీని పెంచాలని, అలాగే మళ్లీ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీంను ప్రవేశపెట్టాలని, అప్పుడే చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ ఉంటుందని క్రెడాయ్ ప్రెసిడెంట్ బొమన్ ఇరానీ తెలిపారు. ప్రస్తుతం రూ.2 లక్షలుగా ఉన్న డిడెక్షన్‌ను రూ.5 లక్షలకు పెంచాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరుతున్నట్లు చెప్పారు.

బడ్జెట్ (2024-25)

నిరాశపరిచిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

క్యూ1లో రూ.16,474 కోట్ల లాభం

ముంబై, జూలై 20: దేశీయ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిరాశజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.16,474 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.12,370 కోట్ల లాభంతో పోలిస్తే 33 శాతం ఎగబాకగా, జనవరి-మార్చి త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే మాత్రం 6.5 శాతం తగ్గింది. బ్యాంక్ ఆదాయం మాత్రం రూ.57,816 కోట్ల నుంచి రూ.83,701 కోట్లకు ఎగబాకింది.

- నికర వడ్డీ ఆదాయం 2.6 శాతం ఎగబాకి రూ.29,840 కోట్లకు చేరుకున్నది. వడ్డీయేతర ఆదాయం మాత్రం 41.3 శాతం తగ్గి రూ.10,670 కోట్లకు పరిమితమైంది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ రూ.2,602 కోట్ల నిధులను వెచ్చించింది. క్రితం ఏడాది కేటాయించిన రూ.13,511 కోట్ల కంటే ఇది తక్కువ.
- బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.24 శాతం నుంచి 1.33 శాతానికి పెరిగాయి.
- కొత్తగా శాఖలను ప్రారంభించడంతో మొత్తం శాఖల సంఖ్య 8,800లకు చేరుకున్నాయి.
- గత త్రైమాసికంలో కొత్తగా రూ.7,900 కోట్ల రుణాలు మొండి బకాయిల జాబితాలోకి చేరాయి.
- పన్నుల కోసం ఒకేసారి రూ.5,107 కోట్ల నిధులు వెచ్చించడంతో ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపింది.
- తాకట్టుకింద పెట్టిన ఆస్తులను విక్రయించడంతో రూ.5 వేల కోట్ల నిధులు సమకూరాయి.

అంచనాలుమించిన యూనియన్ బ్యాంక్

ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను బ్యాంక్ రూ.3,679 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2023-24 ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన లాభంతో పోలిస్తే 13.7 శాతం వృద్ధిని కనబరిచింది. వడ్డీల మీద వచ్చే ఆదాయం